# 2. ఆరాధన అంటే ఆజ్ఞాపాలన

"మేము భూమ్యాకాశాల్ని, వాటి మధ్య ఉన్న సమస్తాన్ని ఏదో తమాషా కోసం సృష్టించలేదు. వాటిని మేము (ఒక మహోన్నత లక్ష్యం కోసం) సత్యం ప్రాతిపదికపై సృజించాము. కాని చాలా మందికి (ఈ సత్యం) తెలియదు." (ఖుర్‌ఆన్-44:38,39)

"మేము భూమ్యాకాశాలను, వాటిలో ఉన్నవాటిని ఏదో ఆట (తమాషా) కోసం సృష్టించలేదు. మేమేదైనా ఆటవస్తువును తయారుచేసుకో దలచుకుంటే, ఈ విధంగానే చేయాలనుకుంటే మాదగ్గర ఉన్నవాటితోనే తయారు చేసుకునేవారం. కాని మేము (ఇక్కడ) సత్యం ద్వారా అసత్యంపై దెబ్బతీస్తున్నాం. ఇలా సత్యం అసత్యం తల పగలగొడ్తుంది. చూస్తుండగానే అసత్యం అంతిమశ్వాస విడుస్తుంది. కనుక మీ అభూత కల్పనలకు మీకు వినాశం తప్పదు." (ఖుర్‌ఆన్-21:16-18)

పైనపేర్కొన్న సూక్తులలో సృష్టికర్త విశ్వవ్యవస్థను తాను లక్ష్యరహితం గా నిర్మించలేదని, దాని వెనుక ఒక మహోన్నత లక్ష్యం ఉందని అన్నాడు. ఆ లక్ష్యం ఏమిటో ఈ సూక్తులలో తెలియజేయలేదు. అది ఈ క్రింది సూక్తిలో తెలియజేశాడు:

"నేను మానవుల్ని, జిన్నుల్ని (అంటే భూతాలను) నన్ను ఆరాధించడానికి తప్ప మరే లక్ష్యంతో పుట్టించలేదు." (ఖుర్‌ఆన్-51:56)

యావత్‌సృష్టిలో మహోత్కృష్టుడైన మానవుని ప్రయోజనార్థమే సృష్టికర్త విశ్వాన్ని సృష్టించాడు. ఆ తర్వాత మానవుడ్ని తన ఆరాధన కోసమే సృష్టించానని పై సూక్తిలో తెలియజేస్తున్నాడు. ఈ సూక్తిలో రెండర్థాలున్నాయి. ఒకటి, దేవుడ్ని తప్ప మరెవ్వరినీ ఆరాధించ కూడదు. రెండు, దైవారాధన తప్ప మరేపనీ చేయకూడదు. మొదటి విషయం అందరికీ అర్థమౌతోంది. కాని రెండోవిషయం నేడు అనేకమంది ముస్లింలకు సైతం అర్థంకావడంలేదు. కారణం వారి మస్తిష్కాలలో "ఆరాధన" పదానికి పరిమిత భావం ఉండిపోవడమే.

ఇస్లాంలో ఆరాధన అనే పదానికి చాలా విస్తృతభావం ఉంది. నమాజ్, ఉపవాసం, హజ్, దైవధ్యానం లాంటి పూజాపురస్కారాలే కాదు; ఉపాధి సముపార్జన, కుటుంబజీవనం, తోటి మానవులతో సంబంధాలు, వ్యాపారం, ఆర్థికలావాదేవీలు, దేశపాలనా వ్యవహారాలు, యుద్ధం, స్నేహఒడంబడికలు, అంతర్జాతీయ సంబంధాలు సైతం ఆరాధన క్రిందికే వస్తాయి. ఒక్కమాటలో చెప్పాలంటే మానవజీవితంలోని సకలరంగాలకు చెందిన సమస్త వ్యవహారాలు దైవారాధనల క్రిందికే వస్తాయి. కాకపోతే ఇవన్నీ దేవుడు, ఆయన ప్రవక్త (స) అందజేసిన ఆదేశాల ప్రకారం పాటించినప్పుడే దైవారాధనలుగా పరిగణించబడతాయి.

ఆరాధనలోని ఈ విస్తృతభావం తెలుసుకుంటే మనిషి జీవితంలోని సమస్త వ్యవహారాల్లో ఎలాంటి అపమార్గం పట్టకుండా సృష్టికర్తను మాత్రమే ఆరాధించగలడు. అంటే మనిషి ఖుర్‌ఆన్, హదీసుల పరిధుల్లో మాత్రమే తన జీవిత వ్యవహారాలు సాగించాలన్నమాట. ఒకే దేవుడ్ని ఆరాధిస్తున్నామని చెప్పుకునేవారు ఎన్ని నమాజులు చేస్తున్నా, ఎన్ని ఉపవాసాలు పాటిస్తున్నా, ఎంత ధ్యానం చేస్తున్నా- దైనందిన వ్యవహారాల్లో దైవేతరశక్తులకో లేక మనో



వాంఛలకో దాస్యంచేస్తుంటే మాత్రం ఆ మేరకు వారు దైవారాధన పరిధిని అతిక్రమిస్తున్నట్లే. అంటే ఆయా వ్యవహారాల్లో వారు దేవునికి సాటి కల్పిస్తున్నారన్నమాట.

కొందరు ఈ వైఖరి కప్పిపుచ్చుకోడానికి లేక అజ్ఞానంవల్ల "ఇవి మతవిషయాలు, అవి ప్రపంచవ్యవహారాలు"ని వాదిస్తారు. కాని ప్రపంచ వ్యవహారాలు కూడా దైవాజ్ఞలు, దైవప్రవక్త హితవుల వెలుగులోనే ఉండాలన్న యదార్థాన్ని వీరు గ్రహించకడం లేదు.

ఇస్లాం సంపూర్ణ జీవనవ్యవస్థ. ఇందులో మతం వేరు, ప్రపంచం వేరన్న భావన లేదు. ప్రపంచ వ్యవహారాలని చెప్పబడే విషయాలు కూడా దైవాజ్ఞల పరిధిలోనే ఉన్నాయి. కనుక ఇస్లాం ధర్మాన్ని విశ్వసించిన మనిషి ప్రపంచ వ్యవహారాలకు సంబంధించిన ఏపని చేసినా అది దైవాజ్ఞల ప్రకారమే (ఖుర్‌ఆన్, హదీసుల వెలుగులోనే) చేయవలసి ఉంటుంది. అప్పుడే అతను దేవుని దృష్టిలో పరిపూర్ణముస్లింగా పరిగణించబడతాడు.

మంచి, చెడులకు సంబంధించిన స్పృహ మానవుని నైజంలోనే ఉంది. మంచికి ప్రతిరూపం దేవుడు. చెడుకు ప్రతిరూపం షైతాన్. దేవుడు ప్రసాదించిన స్వేచ్ఛను మానవుడు దుర్వినియోగం చేయకుండా జీవితాంతం ఆయన చూపిన రుజుమార్గం అనుసరిస్తే అతను పరలోకంలో మోక్షా నికి అర్హుడవుతాడు. అలాకాకుండా అతను విశృంఖలస్వేచ్ఛతో మనో వాంఛలకు బానిసై, చెడుకు ప్రతిరూపమైన షైతాన్ ఆడించినట్లు ఆడుతూ, సృష్టితాలను పూజిస్తూ అవినీతి, అధర్మకార్యకలాపాలలో మునిగిపోతే మాత్రం పరలోకంలో దైవాగ్రహానికి గురై నరకకూపంలో పడిపోతాడు. ఖుర్‌ఆన్‌లోని ఈ సూక్తి (36:60-62) చూడండి :

"ఆదం సంతానమా! షైతాన్‌ని ఆరాధించవద్దని, వాడు మీకు బహిరంగ శత్రువని నేను మిమ్మల్ని హెచ్చరించలేదా? నన్నే ఆరాధించాలని, అదే రుజుమార్గమని ఉపదేశించ లేదా? అయినా వాడు మీలో అత్యధిక మందిని దారితప్పించాడు. మీకా (మాత్రం) జ్ఞానం లేదా?"

ఈ సూక్తిలో 'ఆరాధన' అనే పదాన్ని విధేయతా భావంలో ప్రయోగించబడింది. సాధరణంగా షైతాన్‌ని ఎవరూ పూజించరు. అతని ఆజ్ఞలను మాత్రం శిరసావహిస్తారు. మానవులకు దేవుడు తన ప్రవక్తల ద్వారా ఆజ్ఞలు జారీచేశాడు. కాని అనేకమంది మానవులు షైతాన్ ప్రేరణతో దేవుని ఆజ్ఞలు త్రోసిపుచ్చి, ఇతరుల ఆజ్ఞలు పాటిస్తారు. ఉదాహరణకు, వడ్డీ వ్యవస్థను అంతమొందించాలని దేవుడు ఆజ్ఞాపిస్తున్నాడు. షైతాన్ దానికి వ్యతిరేకంగా ప్రచారంచేస్తూ, వడ్డీవల్ల బోలెడు లాభాలున్నాయని; అసలీ వడ్డీ వలనే పేదవాడి నడ్డి విరగొట్ట యినా సరే నువ్వు మేడలు కట్టగలవు, స్వర్గభోగాలు అనుభవించగలవు అని ధనికుడ్ని ఉసిగొల్పుతాడు; వడ్డీయే దేశప్రగతికి రాచబాట నిర్మిస్తుందని పాలకులను ప్రేరేపిస్తాడు.

ఇలా మానవుడు షైతాన్‌కు భక్తుడైపోతాడు. ఒక ఉద్యోగి తన పైఅధికారిని ప్రసన్నం చేసుకొని ప్రయోజనాలు పొందడానికి అతను చెప్పిన పనల్లా, చివరికి అతని సొంతపనులు కూడా చేస్తాడనుకుందాం. అప్పుడు మనం "అతనా... అతను మేనేజర్‌గారి భక్తుడండీ!" అంటాం. అలాగే ఈ సూక్తిలో కూడా దేవుడు, షైతాన్ పట్ల విధేయతాభావాన్ని షైతాన్ ఆరాధనతో పోల్చాడు. అంటే దేవుని ఆజ్ఞలకు, ఆయనప్రవక్త హితవులకు వ్యతిరేకంగా దైవేతరులు చెప్పే మాటలు పాటిస్తే, అది షైతాన్‌ఆరాధన క్రిందికి వస్తుందన్న మాట. ☸